

పోలీసుల సేవలు చిరస్మరణీయం : ఎఎస్‌పి

ప్రజాశక్తి-కడప అర్బన్

పోలీస్ శాఖలో 35 సంవత్సరాల పాటు అంకిత భావంతో అందించిన సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అదనపు ఎస్పీ(అడ్మిన్) లోసారి సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని మిని కాన్ఫరెన్స్ హాలులో పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించినందుకు పోలీసు శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. పదవి విరమణ తరువాత కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో డిపిఒ ఎఒ జ్యోతి, ఆర్ఐ టైటస్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ పాల్గొన్నారు.

కెసి రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

- 2న నీటి విడుదలకు చర్యలు
- పూడిక తొలగింపులో అధికారులు
- తీరనున్న తాగు, సాగునీటి అవసరాలు

ప్రజాశక్తి -చాపాడు

శ్రీశైలం జలాశయానికి వరద నీరు క్రమంగా పెరుగుతూ వస్తూ పూర్తి స్థాయిలో నిండటంతో కెసి రైతుల ఆశలు పదిలమైనాయి. శుక్రవారం కెసి కెనాల్‌కు నీటి విడుదలకు ఏర్పాట్లు చేపడుతున్నారు. పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. వరి వంగడాలను సేకరించే పనిలో నిమగ్నమవుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్ మొదటి వారానికి శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండింది. కెసి కాలువకు నీటిని విడుదల చేయలేకపోయారు. రైతులు ఆరుతడి పంటలకే పరిమితం కావాల్సి వచ్చింది. ఈ ఏడాది ఎగువ ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదు కావడంతో గత వారంకు సాధారణ నీటి మట్టం ఉన్న శ్రీశైలం ప్రాజెక్టులో పరిస్థితి పూర్తిగా మారినది. శ్రీశైలం రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వలన నీటిమట్టం పెరుగుతోంది. 4.50 లక్షల క్యూసెక్కుల వరకు నీరు వచ్చి చేరుతోంది. బుధవారం సాయంత్రానికి 883 అడుగులకు చేరి 203 టిఎంసిలకు చేరింది. ఎగువ ప్రాంతాల్లో ఆల్మట్టి, జూరాల ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో నీరు చేరడంతో శ్రీశైలం ప్రాజెక్టుకు నీటి ప్రవాహం పెరుగుతోంది. కెసికి నీరు విడుదల అవుతుందని రైతులు అంచనాలు వేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882 అడుగులకు చేరుకుంది. ఎగువ నుండి నీటి ప్రవాహం అధికంగా ఉంటే ఆగస్టు మెదటి వారానికి కెసి కాలువకు తప్పక నీరు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కుందూ, పెన్నా పరిధిలో ఇప్పటికే రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై విత్తనాలు, ఎరువులు సేకరించే పనిలో పడ్డారు. సకాలంలో నీరు విడుదల అయితే కెసి, కుందూ పరిధిలో మండల వ్యాప్తంగా 16 వేల ఎకరాలలో వరి పైరు సాగు అయ్యే అవకాశం ఉంటుంది. కుందూ, పెన్నా పరిధిలో ఇప్పటికే 3వేల ఎకరాలలో వరి పంట సాగు చేపట్టేందుకు వరి నారు సాగు చేపట్టారు.



కెసి కెనాల్ ప్రధాన కాలువ

నేడు ఆదినిమ్మాయపల్లి నుంచి నీటి విడుదల

చెన్నూరు : వల్లూరు మండలం ఆదినిమ్మాయపల్లె వద్ద పెన్నా నదిపై నిర్మించిన ఆనకట్ట నుంచి కడప, చెన్నూరు కెసి కాలువకు నీటిని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి గురువారం ఉదయం 9 గంటలకు విడుదల చేయనున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు కల్లూరు విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతులు వరి పంట సాగు చేసేందుకు కడప, చెన్నూరు పరిధిలోని కెసి ఆయకట్టుకు నీరు అందుతుందని తెలిపారు.

కబ్జాదారుల నుంచి భూములను స్వాధీనం చేసుకోవాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్

ప్రజాశక్తి-బ్రహ్మంగారిమఠం

మండల పరిధిలోని సోమిరెడ్డి పల్లె రెవెన్యూ పొలం చీటిపాయిలో పేదలు సాగులో ఉన్న ప్రభుత్వ భూములపై టిడిపి నాయకులు దౌర్జన్యం మానుకోవాలని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు ఆధ్వర్యంలో చీటిపాయిలో ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పేదలు పది సంవత్సరాల నుంచి చీటిపాయిలో ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వకపోవడం వలన ఆ భూములను సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. మామిడి చీనీ, జామ, టేకు నాటిన మొక్కలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఆ భూమిని పేదలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ భూములు స్థానిక నిరుపేదల కుటుంబాలకు మాత్రమే అర్హులు కానీ చీటిపాయిలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు అనర్హులు ఆక్రమించుకున్న వారిపైన రెవెన్యూ యంత్రాంగం ఎటువంటి కేసులు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పేదలు ఒక ఎకరా సాగు చేయడానికి పోతే ట్రాక్టర్లు ఆపడం పోలీసుల చేత కేసులు నమోదు చేయించడం చేస్తున్నారన్నారు. నూతనంగా ఏర్పడిన టిడిపి ప్రభుత్వం మీద గంపెడ ఆశలు పెట్టుకున్న పేదల భూములను ఆక్రమించుకున్న భూములను స్వాధీనం చేసుకుంటారని పేదలు సాగులో ఉన్న వారికి పట్టాలు మంజూరు చేస్తారని ఎదురు చూస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రభుత్వ భూములను కాపాడాలని అన్యాకాంతమైన భూములను స్వాధీనం చేసుకోవాలని చట్ట ప్రకారం స్థానిక పేదలకు భూ పంపిణీ చేసి వలసలు నివారించే పద్ధతిలో చూడాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ జాన్సన్‌కు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేదలతో కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గండి సునీల్ కుమార్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహ, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బమ్మ, గోవింద్, చిన్నక్క, దాసరి ప్రశాంతి, భాగ్యమ్మ, సరోజ, వెంకటమ్మలు, పీర్ మందిర్, సిద్దు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న నాయకులు

కేంద్ర బడ్జెట్ అంకెల్లో ప్రజా ప్రయోజనాలు లేవు

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి-కడప అర్బన్

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల్లో ప్రజాప్రయోజనాలు లేవని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన పూర్తి బడ్జెట్ అంకెల వెనుక, ప్రజల ప్రయోజనాలు లేవని తెలిపారు. పరోక్ష పన్నులు ప్రజలపై పెంచారని, సంపన్నులకు, పేదలకు ఒకే పన్ను సరైంది కాదని పేర్కొన్నారు. అప్పులు తెచ్చి ఆదాయాన్ని తెచ్చిపెట్టే రంగాల్లో ఖర్చు పెట్టకుండా దాటేసారని తెలిపారు. లాభాల్లో ఉండే ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్లకు కారు చౌకగా బిహెచ్ఎల్ లాంటి ఎన్నో ప్రభుత్వ సంస్థలను అప్పగిస్తున్నారన్నారు. పాలకులకు ప్రజల ఆర్థిక సమస్యల పరిష్కారంపై నిబద్ధత లేదన్నారు. దేశ లోని పేద, మధ్యతరగతి, వేతన జీవుల పక్షాన నిలిచి ఆలోచించే వామపక్ష మేధావులైన ఎంపీలు పార్లమెంటులో బాగా తగ్గారన్నారు. బడ్జెట్లో దేశ హితులు, సంస్థలు చేసిన ఆర్థిక సర్వేలు పరిగణలోకి తీసుకోలేదని, ఉపాధి, ఉద్యోగ అవకాశాల పైన దృష్టి పెట్టలేదని చెప్పారు. రోజు రోజుకు పెరుగుతున్న ప్రజల ఆహార వస్తువుల ధరలు అదుపు చేసే ప్రక్రియ లేదని, దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతులను తగ్గించే చర్యలు మరిచారని విమర్శించారు. దేశంలోనే 100 మంది వద్ద దేశంలోనే 41 శాతం ప్రజల సంపద పోగై ఉంటే, వారి నుంచి క్యాపిటల్ ప్రైవేట్ ఇన్వెస్ట్మెంట్ పెట్టించడంపై చాలా స్లో పద్ధతి అనుకరిస్తున్నారని తెలిపారు. వారి వద్ద పోగైన సంపద విలాసాలకు ఖర్చు చేస్తున్నారని, దానికి నిదర్శనం ముకేశ్ అంబాని కుమారుని పెళ్లికి రూ.5 వేల కోట్లు ఖర్చు పెట్టడమేనని పేర్కొన్నారు. దేశ ద్రవ్యలోటు తగ్గించుకోవడానికి ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.రామమోహన్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శివ శంకర్ లోతేటి

ప్రజాశక్తి-కడప/కడప అర్బన్

78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి జిల్లా అధికారులను ఆదేశించారు.బుధవారం స్థానిక కలెక్టరేట్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (గ్రీవిన్స్) హాలులో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, ఎఎస్‌పి సుధాకర్‌లతో కలిసి అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15న స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను, వేదికను అందంగా అలంకరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమర యోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరైన వారికి తాగునీటిని సరఫరా, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని కడప ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ రాకేష్‌ను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించి జిల్లాలో సాధించిన ప్రగతిని చాటిచెప్పేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్ళను ఏర్పాటు చేయాలని డిఆర్‌డిఎ, డ్వామా, హార్టికల్చర్, ఎపిఎంఐపి, జల వనరుల శాఖ, వ్యవసాయం, ఎస్సీ కార్పొరేషన్, తదితర శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉదయం పెరేడ్ మైదానంలో సాంస్కృతిక కార్యాక్రమాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను కన్నుల పండువగా సాగేలా సంసిద్ధం చేయాలని డిపిఒను ఆదేశించారు. పెరేడ్ మైదానంలో రంగు కాగితాలు, పూల అలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దాలన్నారు. ఆయా శాఖల్లో విశిష్ట సేవలు అందించిన ఉత్తమ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయడానికి సంబంధిత ప్రతిపాదిత జాబితాను నిర్ణీత గడువు లోపు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కడప ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ వెంకటపతి సిపిఒ వెంకటరావు, జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, వ్యవసాయ శాఖ జెడి నాగేశ్వరరావు, డిటిసి మీరా ప్రసాద్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ విజయరెడ్డి

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - వల్లూరు : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఎంఇఒ-2 పుత్తా విజయరెడ్డి అన్నారు. నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ పిఎంశ్రీ మోడల్ జూనియర్ కాలేజ్ ఫ్రెషర్స్ డే వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకొని వాటిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే చదివిన చదువుకు సార్థకం ఉంటుందన్నారు. విద్యార్థు లు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా సత్తా చాటాలన్నారు. అనంతరం విద్యార్థులు సంస్కృతి కార్యక్రమంలో అలరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ భాస్కర్, పాఠశాల ప్రిన్సిపల్ ఎం.సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండ్ల తోటలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-కాశినాయన : గ్రామాలలోని రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలని ఎపిఒ జయరాముడు తెలిపారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ సభావనంలో ఉపాధి సిబ్బందితో సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న తోటల పెంపకం రైతులకు ఎంతో ఉపయోగకరమని దానిలో వచ్చే ఉపయోగాలను ప్రభుత్వం నుండి వచ్చే రాయితీలను వారి క్లుప్తంగా వివరించాలన్నారు. రైతులను ఇప్పించిన అనంతరం వారి దగ్గర నుండి ఏమేమి అవసరమో తీసుకొని ఎస్టిమేట్‌లు కూడా వేయించాలన్నారు. ఉపాధి కూలీలకు రావలసిన కూలీ డబ్బులు తొందరలో వస్తాయని అడిగిన కూలీలకు తెలియపరచమన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎపి హంస నాయకులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్: కలెక్టర్ శివ శంకర్‌ను బుధవారం ఎపి హంస నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎపి హంస జిల్లా అధ్యక్షులు బి.రాజరత్నం, కార్యదర్శి చంద్రమౌళి, కోశాధికారి జయ ప్రకాష్, ఉపాధ్యక్షులు జయకుమార్, సీనియర్ అసిస్టెంట్ సుధీర్ కుమార్, రాజశేఖరాచారి, రాధిక, కడప సిటీ యూనియన్ సభ్యులు షణ్ముఖం, శ్రీనివాసులు, ఇంతియాజ్, షఫీ ఉల్లా పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 160 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-బద్వేలు: విద్యార్థులకు విద్య ఒక్కటే కాదు ఉపాధి కూడా అవసరమని రాచపూడి నాగభూషణం విద్యా సంస్థల వ్యవస్థాపకులు ఆర్‌వి సాయికృష్ణ పేర్కొన్నారు. బుధవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో ఆయన మాట్లాడుతూ మా తండ్రి గరైన రాచపూడి నాగభూషణం సంకల్పానికి ప్రాణం పోస్తూ రాచపూడి నాగభూషణం విద్యాసంస్థల్లో చదువు పూర్తి చేసినటువంటి విద్యార్థులే కాకుండా ఇతర ప్రాంతాల విద్యార్థుల ఉపాధికి తమ కళాశాలలో ఫోక్స్‌కాన్, ఫ్లిప్ కార్ట్, లాంటి సంస్థల ప్రతినిధుల సమక్షంలో తమ కాలేజీ ఫ్యాకల్టీల సహకారంతో ఇంటర్వ్యూలు నిర్వహించి డేటా ఎంట్రీ ఆపరేటర్, సీనియర్ అసిస్టెంట్, బిల్లింగ్ ఆపరేటర్, స్కానింగ్, ప్యాకింగ్, వంటి ఉద్యోగాలలో నైపుణ్యాన్ని విద్యార్హతను బట్టి వారికి ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ అభిమతమని పేర్కొన్నారు. జాబ్ మేళాలో పాల్గొన్న పలు సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధి ఇంటర్వ్యూలో హాజరైన 200 మంది విద్యార్థులలో 160 మందికి మా సంస్థలలో ఉపాధి కల్పించామని, ఈ అవకాశం కల్పించిన కళాశాల అభిమాన్యానికి, ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఫ్యాకల్టీ ఇన్చార్జులు వినోద్ కుమార్, కబీర్, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..విద్యార్థులకు గాయాలు

- రిమ్స్‌లో విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అట్లూరు

మండలంలోని పెద్ద కామసముద్రం ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఐదుగురు విద్యార్థులు గాయపడ్డారు. గ్రామాల్లో విద్యుత్ పనుల కోసం సిమెంటు స్తంభాలను పాఠశాల ముందు ఉంచారు. బుధవారం పాఠశాల లోపలికి వెళుతున్న విద్యార్థులపై స్తంభాలు పొర్లడంతో ఐదుగురు గాయాలపాలయ్యారు. ఈ ఘటనలో ఐదవ తరగతి చదువుతున్న గద్దె స్రవంతి కాలు విరిగింది. మిద్దెల ప్రతీక, రిత్విక, రోషన్, మిద్దెల రుషికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న అట్లూరు ఎస్ఐ కెసి.రాజు సంఘటన స్థలానికి చేరుకుని అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి విద్యార్థులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థులను బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా రిమ్స్‌లో పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఎం.ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, నాయకులు బ్రహ్మారెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.



గాయపడిన విద్యార్థితో తల్లిదండ్రులు



విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుధా

ఇళ్ల నిర్మాణంలో ప్రజలు ఇబ్బంది పడొద్దు

ప్రజాశక్తి-కడప అర్బన్ : చంద్రబాబు ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణంలో పేద ప్రజలు ఇబ్బంది పడకూడదని టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే కీలకమైన 5 ఫైళ్లపై సంతకం చేశారని తెలిపారు. వేలాది మంది నిరోద్యోగులు,రైతులు,యువత, పెదలకు లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. హౌసింగ్ ఫర్ అల్ అనే నినాదంతో చంద్రబాబు ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు లక్షల ఎకరాలు దోచుకోవడానికి వైసిపి నేతలకు భూమి ఉందని, పేదవాడికి రెండు సెంట్లు ఇవ్వడానికి నాడు భూమి లేదన్నారు. జర్నలిస్టులకు ఇళ్ళు కట్టించి ఇస్తుందని తెలిపారు.

అందరివాడు అరుళయ్య

ప్రజాశక్తి-కడప అర్బన్ : చిన్న, పెద్ద, ధనిక పేద, బంధుప్రీతి, ప్రాంతీయ భాషా అభిమానం అన్న భేదం లేకుండా అందరిని సమానులుగా, సమానత్వంతో చూడడం ద్వారానే అరుళయ్య అందరివాడు అయ్యాడని శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ తెలిపారు. అరుళయ్య 21వ పద్ధతి పురస్కరించుకుని మరియాపురం సెయింట్ మేరీస్ కథిడ్రల్ చర్చిలోని ఆయన గాట్‌లో సొసైటీ సభ్యులతో కలిసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అల్లూరి జోజప్ప, అరుళయ్య, రాజేష్ పాల్గొన్నారు.

ఊసే లేని సంక్షేమ పథకాలు : కాంగ్రెస్

ప్రజాశక్తి-కడప అర్బన్ : అధికారంలోకి రాక ముందు ఎన్నికల మేనిఫెస్టోలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సంక్షేమ పథకాలు 50 రోజులు అవుతున్నా అమలుకు నోచుకోలేదని కాంగ్రెస్ నాయకులు సయ్యద్ సలావుద్దీన్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం వైవి స్ట్రీట్‌లోని ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆడబిడ్డ నిధి కింద 18 నుంచి 59 ఏళ్ల వయస్సున్న మహిళలకు నెలకు రూ.1500లు నేరుగా అకౌంట్లో జమ చేస్తామని తెలిపారన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం, 50 ఏళ్ళు నుంచి బిసిలకు వృద్ధాప్య పెన్షన్, యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు త్వరలో అమలు చేస్తారని, పేద ప్రజలు ఎదురు చూపులు చూస్తున్నారన్నారు. హామీ ప్రకారం అమలు చేస్తారా? లేకుంటే వాయిదాల మీద వాయిదాలు వేస్తారో చెప్పాలన్నారు.



మాట్లాడుతున్న సలావుద్దీన్

సిమెంట్ పరిశ్రమల్లో రక్షణ కరువు : సిఐటియు

ప్రజాశక్తి-కడప అర్బన్ : సిమెంట్ పరిశ్రమల్లో సరైన రక్షణ పరికాలు లేక అనేక మంది కార్మికులు చనిపోతున్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ అన్నారు. బుధవారం న్యూఢిల్లీలోని బిటిఆర్ భవన్‌లో నిర్వహించిన సిమెంట్ ఆల్ ఇండియా కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో దేశంలో సిమెంట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, కష్టాలు, బాధలు గురించి లోతుగా చర్చించారు. సిమెంటు పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు చాలా మంది అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారని చర్చల్లో ప్రస్తావించారు. దేశం, రాష్ట్రం, జిల్లాలో ఉన్న పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులను సమీకరించి చలోఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. అత్యధిక లాభాలు గడించేది సిమెంట్ పరిశ్రమ, ఆ లాభాలు రావడానికి కార్మికుల శ్రమ ఒక ముఖ్య కారణమని, పనిచేస్తున్న కార్మికుల పరిస్థితి మాత్రం ఘోరంగా ఉందని చెప్పారు. పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులను ఐక్యం చేయాలని నిర్ణయించారన్నారు. సిమెంట్ పరిశ్రమంలో వచ్చే సమస్యల పైన నిరంతరం పోరాటం చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు.

రఫీ పాటలు మరువలేం

ప్రజాశక్తి - కడప : గాయకుడిగా మహమ్మద్ రఫీని, ఆయన పాడిన పాటలను ఎప్పటికీ మరువలేమని ప్రముఖ గాయకులు బాషా అన్నారు. మహ్మద్ రఫీ 44వ వర్ధంతి సందర్భంగా జి.రామారావు వీధిలోని బాషా ఆర్ట్స్ కార్యాలయంలో రఫీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రఫీ అతి తక్కువ సమయంలో ఎన్నో ఉత్తమమైన గీతాలను అందించారని, అందులో స్వర్గీయ ఎన్‌టి.రామారావు ఆరాధన, భలే తమ్ముడు చిత్రాలలో ఆయన పాడిన గీతాలను నేటికీ గుర్తుండేలా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిరాజ్, కాలేషా, బాబు పాల్గొన్నారు.

ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-చెన్నూరు : మండల వ్యాప్తంగా గురువారం ఇంటింటికి ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమం తెల్లవారుజామున 4.30 గంటల నుండి సచివాలయ ఉద్యోగస్తులు పంపిణీ చేస్తారని ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పింఛను పంపిణీ సందర్భంగా లబ్ధిదారులందరూ ఇంటి వద్దనే ఉండాలన్నారు.



విసిలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప/కడప అర్బన్

పింఛన్ల పంపిణీ కార్యక్రమం జిల్లాలో సజావుగా జరగాలని ఆలసత్వం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ శివశంకర్ లోతేటి క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలు నుండి ఆగస్టు 1న చేపట్టే ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీ కార్యక్రమంపై జెసి అదితి సింగ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందరరేగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు కోసం అప్రమత్తంగా ఉండాలన్నారు. సజావుగా పెన్షన్ల పంపిణీ జరిగేలా వారు చర్యలు తీసుకోవాలన్నారు. పెన్షన్ల పంపిణీ కోసం బయోమెట్రిక్ డివైజ్, యాప్‌లో ఎక్కడ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. పెన్షన్ల పంపిణీ విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే వారిపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పెన్షన్ల పంపిణీలో ప్రజాప్రతినిధులు పాల్గొనే కార్యక్రమాన్ని తెలుసుకొని వారితో సమన్వయంతో కార్యక్రమానికి సజావుగా జరిగే విధంగా చూడాలన్నారు. ఎక్కడా చిన్న పొరపాటు జరగడానికి వీలులేదన్నారు. పెన్షన్ల పంపిణీ అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్లను అందించాలని ఆదేశించారు. మండల స్పెషల్ అధికారులు ఈరోజు రాత్రికి మండల కేంద్రాలలో ఉండి పర్యవేక్షించాలని తెలిపారు. (ఆగస్టు 1వ తేదీన ఉదయం 4 గంటలకే సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సాయంత్రం 6 గంటలకే పెన్షన్ మొత్తాన్ని లబ్ధిదారులకు 100 శాతం పంపిణీ చేయాలన్నారు. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్త వహించాలన్నారు. పెన్షన్ల పంపిణీకి సంబంధించి బయోమెట్రిక్ డివైస్ సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, డిపిఒ ప్రభాకర్ రెడ్డి, కుడ విసి నందన్, కెఎంసి అదనపు కమిషనర్ రాకేష్, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, ఎల్‌డిఎం జనార్ధన్ పాల్గొన్నారు.



ఛాంపియన్ షిప్ సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జంప్‌రోప్‌లో మైదుకూరుకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి - మైదుకూరు


ఈనెల 27, 28 తేదీల్లో నంద్యాల జిల్లాలో నిర్వహించిన ఐదవ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ జంప్‌రోప్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ పోటీలో మైదుకూరు జడ్పీ బాలుర పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్ తెలిపారు. ఆ మేరకు బుధవారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ జంప్‌రోప్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలో పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు 6 ఈవెంట్లలో పాల్గొని రాష్ట్రస్థాయిలో రెండవ స్థానంలో ఓవరాల్ ఛాంపియన్ షిప్ కైవసం చేసుకున్నారని తెలిపారు. పీడీ వినోనియారాణి, చంద్రావతిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీసాల మునయ్య, ఎల్.సూర్యనారాయణ రెడ్డి, ఎ.శ్రీనివాసులు, ప్రభాకర్, పద్మనాభయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

48 రోజుల్లోనే రూ.12 వేల కోట్లు అప్పు

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 రోజుల్లోనే రూ.12 వేల కోట్లు అప్పు చేసిందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకినట్లుంది చంద్రబాబు ప్రభుత్వ వైఖరి అన్నారు. జగన్ ప్రభుత్వం ఆర్థిక అరాచకత్వానికి పాల్పడి అందినకాడల్లా అప్పుతెచ్చి రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిందని టిడిపి కూటమి పార్టీలు కోడై కూశాయని తెలిపారు. ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం అదే పని చేస్తోందని విమర్శించారు. జూన్ 25న 2వేలు కోట్లు, జులై 7న 5వేలు కోట్లు, జులై 16న 2 వేలు కోట్లు, జులై 30న మరో 3 వేల కోట్లు రిజర్వ్ బ్యాంకు దగ్గర అప్పు చేసిందని వివరించారు. జగన్ ప్రభుత్వానికి, చంద్రబాబు ప్రభుత్వానికి తేడా కనిపించడం లేదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 4 నెలలు గడిచిపోయినా ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 48 రోజులైనా రెగ్యులర్ బడ్జెట్ ప్రవేశపెట్టక పోవడం శోచనీయమన్నారు. ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఒకే ఆర్థిక సంవత్సరంలో 2 సార్లు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టడం శోచనీయమని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పెట్టకుండా ఆర్డినెన్సు ఇవ్వడం దురదృష్టకరమని విమర్శించారు. ఈ చర్య అసెంబ్లీని కించపరచడం అవుతుందన్నారు. ఆరోగ్యశ్రీ కాంగ్రెస్ మానస పథకమన్నారు. కొన్ని లక్షల మందికి ప్రాణ భిక్ష పెట్టిందని తెలిపారు. ఈ పథకాన్ని రద్దు చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉంటే వెంటనే విరమించుకోవాలని కోరారు. 8 నెలలుగా పెండింగులో ఉన్న రూ.2,500 కోట్ల ఆరోగ్యశ్రీ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. పేదలకు వైద్యం అందుబాటులోకి తేవాలని తులసిరెడ్డి సూచించారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భూపేష్ సుబ్బరామిరెడ్డి

ఘనంగా మౌలాలి స్వామి ఉత్సవాలు

ప్రజాశక్తి - పెద్దముడియం

మండలంలోని చిన్నపసుపుల గ్రామంలో స్థానికులు బుధవారం మౌలాలి స్వామి జార్తలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జమ్మలమడుగు టిడిపి ఇన్‌చార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి విచ్చేయగా.. ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మౌలాలి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి ఘటనలకు తావివ్వకుండా పండుగ కార్యక్రమాన్ని ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. భక్తిశ్రద్ధలతో మౌలాలి స్వామికి ప్రసాదాలు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో తెలుగు దేశం నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గిరిజన చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆరోగ్యంగా ఉండడమే మహాభాగ్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ అండ్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. మండల పరిధిలోని చిటిమిటి చింతల (పాటి) గ్రామంలో బుధవారం రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ శ్రీదేవి సూచనల మేరకు గిరిజనులకు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషలిస్ట్ డాక్టర్లచే గిరిజనులకు వైద్య సదుపాయాలు కల్పించడం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. బిపి, షుగర్ పరీక్షలతోపాటు వైద్యులు ఉచితంగా ఈసీజీ ఏర్పాటు చేశారు. మెడికల్ స్టాల్స్, న్యూట్రిషన్ స్టాల్స్‌ను ఏర్పాటుచేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. న్యాయ సదస్సులో పలు చట్టాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. జమ్మలమడుగు డిప్యూటీ డిఎంహెచ్ఓ శాంతికళ ఆరోగ్యంగా ఉండేందుకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సమితి ఎస్.భార్గవి, అసిస్టెంట్ ట్రైబల్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, ఎంపీడీవో, చిటిమిటి చింతల ఎస్టీ కాలనీ సిడిపిఓ రాజేశ్వరి, జమ్మలమడుగు బార్ సెక్రెటరీ మురళీధర్‌రెడ్డి, కల్లాయమ్మ సర్పంచ్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కల్పన, పంచాయతీ సెక్రెటరీ, వైద్యాధికారులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, గిరిజనులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ కోర్టు జడ్జి బాబా ఫక్రుద్దీన్

అలిరెడ్డిపల్లె హైలెవల్ బ్రిడ్జి పరిశీలన



బ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పాపాఘ్ని నదిలో నిర్మించిన వేంపల్లె-అలిరెడ్డిపల్లె మార్గంలో నిర్మించిన హై లెవల్ బ్రిడ్జిని బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పరిశీలించారు. పిఎంజిఎస్‌వై నిధుల కింద రూ.32.96 కోట్ల నిధులతో వేంపల్లె-అలిరెడ్డిపల్లె హై లెవల్ వంతెనను నిర్మించారు. కడప క్వాలిటీ కంట్రోల్ ఇఇ సూర్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వంతెనను తనిఖీ చేశారు. ఇసుక లారీలను హై లెవల్ వంతెన మీద ఉంచి నాణ్యతను పరిశీలించారు. వంతెన నాణ్యతపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా అలిరెడ్డిపల్లె, తూపల్లె గ్రామాల ప్రజలు బ్రిడ్జి లేకపోవడంతో పాపాఘ్ని నదికి నీరు వచ్చినప్పుడు చాలా ఇబ్బందులు పడేవారు. ఇన్ని రోజులకు బ్రిడ్జి పూర్తి కావడంతో గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వంతెన పరిశీలనలో డిఇలు గురివిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎఇలు గణేష్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, మునిరెడ్డి, నాగేంద్ర, చంద్రమౌళి పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు ఓకే.. విధులు నాట్ ఓకే..!

సమయపాలన పాటించని సచివాలయం ఉద్యోగులు - అధికారుల పర్యవేక్షణ లోపం

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సచివాలయం వ్యవస్థ ఉద్యోగుల తీరు వల్ల నీరుగారుతోంది. ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ధృఢ సంకల్పంతో ప్రభుత్వం కొన్ని శాఖలకు బయోమెట్రిక్, ముఖ విధానం హాజరు అమలు చేసింది. గ్రామాల్లోని సచివాలయం ఉద్యోగులు సమయపాలన పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. ఉద్యోగుల తీరు పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయం సిబ్బంది బయోమెట్రిక్, ముఖ హాజరు వేస్తారు.. కానీ సచివాలయంలో ఉండరు.. ఫీల్డ్‌లో కనపడరనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయం ఉద్యోగులు కొంత మంది సమన్వయంతో సగం మందికిపైగా ఇంటి వద్ద నుంచే వీడియో కాల్ ద్వారా ముఖ హాజరు వేస్తున్నారు. హాజరు ఉదయం 10 గంటలకు వేస్తారు.. 11పైన కార్యాలయానికి వస్తే వస్తారూ.. లేక పోతే లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మళ్లీ సాయంత్రం 5 తర్వాత హాజరు వేయాల్సి ఉండగా సచివాలయనికి వెళ్లకుండా ఇంటి వద్ద నుంచే హాజరు వేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ముద్దనూరు, చుట్టుపక్కల గ్రామాల్లో నివాసం ఉంటున్న సిబ్బంది కొందరు ఇంటి వద్ద నుంచే హాజరు వేస్తున్నారు. మండలంలోని కొన్ని సచివాలయాల్లోని ఉద్యోగుల తీరు ఇలాగే ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు (డిడిఒలు) మరీ దారుణంగా ఉన్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కార్యదర్శులు గ్రామ పంచాయతీల వైపు కన్నెత్తి చూసిందే లేదని పేర్కొంటున్నారు. గ్రామ పంచాయతీల్లో, సచివాలయాల్లో, ఫీల్డ్‌లో కనపడరని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. సచివాలయం సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు (డిడిఓ)లను ఆదర్శంగా తీసుకుని విధులకు గైర్హాజరు అవుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా పంచాయతీ కార్యదర్శులు (డిడిఓ)లు సచివాలయ ఉద్యోగులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వీరు ప్రభుత్వాన్ని మోసం చేస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి సేవలు అందించకుండా కాలయాపన చేస్తూ ప్రతి నెలా ప్రభుత్వం నుండి జీతం తీసుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయం సిబ్బంది హాజరు వేసి సచివాలయంలో ఉండకుండా సొంత పనులు చూసుకుంటున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. బయోమెట్రిక్ హాజరుపై మండల అధికారులు చూసీచూడనట్లు వ్యవహ రిస్తున్నన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగులకు ప్రభుత్వం ఎన్ని నిబంధనలు అమలు చేసినా ఉద్యోగుల తీరు మారడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. సచివాలయం సిబ్బందిపై చర్యలు తీసుకునే అధికారం తమకు లేదని ఎంపిడిఓ చంద్ర మౌళీశ్వర్ అనడం గమనార్హం. ఉన్నతాధికారులు స్పందించి సమయ పాలన పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్న సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ముద్దనూరు ఎంపిడిఓ మహిళా పోలీ సులకు కొత్త బాధ్యతలు కేటాయించారు. సెల్ మానిటరింగ్ పేరుతో ఎంపిడిఓ కార్యక్రమంలో ఇద్దరు మహిళా పోలీసులను ఏర్పాటు చేశారు. వీరు ఎంపిడిఓ సిబ్బందికి సూచించిన విధులు నిర్వహించాల్సిన బాధ్యతలను మహిళా పోలీసులు పరి శీలించి ఎంపిడిఓకు తెలియజేసే విధులు అప్పగించారు.

హాజరు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం

విధుల పట్ల అలసత్వం వహిస్తూ తప్పుడు హాజరు వేస్తున్న విషయమై పరిశీలించి వారిపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ప్రభుత్వ నిబంధనలు, సమయపాలన పాటించని సిబ్బంది పని తీరును పరిశీలించి, ఆయా శాఖల ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. చర్యలు తీసుకునే అధికారం ఎంపిడిఓకు లేదు. మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ప్రతి రోజూ ఇద్దరు మహిళా పోలీసులకు సెల్ మానిటరింగ్ విధులు కేటాయించాం. వీరు ప్రతి రోజు సిబ్బంది హాజరు, విధులను పర్యవేక్షిస్తారు.

- చంద్రమౌళీశ్వర్, ఎంపిడిఓ

ప్రతి ఉద్యోగికి విరమణ తప్పనిసరి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన ప్రతివారికి ఉద్యోగ విరమణ అనేది తప్పదని ఫ్లయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఓ గురు ప్రభాకర్, సబ్ డిఎఫ్ఓ స్వామి వివేకానంద పేర్కొన్నారు. వేంపల్లె ఫారెస్ట్ ఆఫీసులో బుధవారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నామే రసూల్ ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో 35 ఏళ్లుగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఉన్నతాధికారుల ప్రశంసలను రసూల్ పొందారన్నారు. కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్ఓ నయీమ్ ఆలీ, కడప ఎఫ్ఆర్ఓ ప్రసాద్, వేంపల్లె ఎఫ్ఆర్ఓ పి.బాలసుబ్రమణ్యం, కడప జిల్లా యూనియన్ నాయకుడు నాగరాజు, శ్రీనివాసులు, రాజశేఖర్ రాజు, నాగూరు బాషా, మధు, శివమోహన్‌రెడ్డి, మనోహర్ బాబుతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

- ఎంపిడిఓ సల్మాన్‌రాజ్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో సల్మాన్ రాజ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 5,457 మంది లబ్ధిదారులకు రూ.2.27 కోట్లు చెల్లింపు చేసేలా ఏర్పాటు చేశామన్నారు. పెన్షన్ పొందే లబ్ధిదారులు ఉదయం 6 నుంచి తమ ఇంటి వద్ద అందుబాటులో ఉండాలన్నారు.



పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి హర్షవర్ధన్ రాజు

బాధితులకు సత్వర న్యాయం : ఎస్‌పి

ప్రజాశక్తి - ఖాజీపేట

పోలీస్‌స్టేషన్‌కు వివిధ సమస్యల నిమిత్తం వచ్చే బాధితులకు సత్వర న్యాయ సేవలు అందేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎస్‌పి హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ కార్యాలయాన్ని బుధవారం ఎస్‌పి మైదుకూరు డిఎస్‌పి వెంకటేశులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి, ఇసుక అక్రమ రవాణా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా, స్నేహపూర్వకంగా మెలగాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో చోరీలు జరగకుండా గస్తీని ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ రామాంజులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైదుకూరు : ఎస్‌పి వి.హర్షవర్ధన్‌రాజు మైదుకూరు డిఎస్‌పి కార్యాలయం, మైదుకూరు అర్బన్, రూరల్ పోలీస్‌స్టేషన్‌లను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. నూతనంగా అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)పై అవగాహన పెంపొందించుకోవాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిఎస్‌పి వెంకటేశులు, మైదుకూరు రూరల్ సిఐ శ్రీనాథరెడ్డి, అర్బన్ ఎస్ఐ గణ మద్దిలేటి పాల్గొన్నారు.

అనుమతిలేని లే అవుట్ల యజమానులకు నోటీసులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో అనుమతులు పొందకుండా గృహ నిర్మాణాలకు లే అవుట్‌లు ఏర్పాటు చేసిన యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి తెలిపారు. మండల కేంద్రమైన చాపాడులో అనుమతులు లేని లే అవుట్లను బుధవారం ఆమె పంచాయతీ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాపాడు, పల్లవోలులో అనుమతులు లేకుండా కొంతమంది లే అవుట్లను ఏర్పాటు చేశారన్నారు. గతంలో నోటీసులు జారీ చేసిన వారి నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యజమానులకు మళ్లీ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. చాపాడులో 64, 74, 75, 76 సర్వే నెంబర్లలో ఏర్పాటు చేసిన లే అవుట్లకు నోటీసులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ధనుంజయ బాబు, జానకిరామ్, సచివాలయ సర్వేయర్ తులశీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఆర్‌పి కన్నారెడ్డి

సామాజిక తనిఖీ పారదర్శకంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - చాపాడు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద మండల వ్యాప్తంగా జరిగిన పనులపై సామాజిక తనిఖీ పక్కాగా నిర్వహించాలని ఎంపిడిఓ రహంతుల్లయ్య తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనం వద్ద బుధవారం 2023-24 ఏడాదిలో జరిగిన ఉపాధి హామీ పనులపై ఎస్ఆర్‌పి, డిఆర్‌పి, సామాజిక తనిఖీ బృందానికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గురువారం నుంచి సిబ్బంది గ్రామాల్లో తనిఖీ చేపడతారన్నారు. ఉపాధి కూలీలు సిబ్బందికి సహకరించాలన్నారు. ఎస్ఆర్‌పి కన్నారెడ్డి సామాజిక తనిఖీ సిబ్బందికి అవగాహన కల్పించారు. అందుకు సంబంధించిన పత్రాలను వారికి అందజేశారు. కార్యక్రమంలో ఎపిఓలు జగదీశ్వర్ రెడ్డి, పద్మారాణి, డిఆర్‌పిలు పాల్గొన్నారు.